# ఇదో రకం బాధ

"మనిషి జన్మ ఎత్తగానే సరిపోదు. కొంచెమన్నా ఇంగితం వుండాలి. ఎలాగోలా బ్రతకటం కంటే .. ఛీ ఛీ !"

ఇంట్లోకి అడుగు పెడుతూండగనే కనపడిన దృశ్యానికి కోపం వచ్చిన కుటుంబరావు కూతురు కుసుమవంక చూస్తూ అని విసురుగా గదిలోకి వెళ్ళాడు

టిఫెన్ ప్లేటును ముందుకు నెట్టి వడివడిగా తన గదిలోకి వెళ్ళి గడియవేసుకుంది కుసుమ. అప్పటికే ఆమె కళ్ళలో నీరు సుడులు తిరుగుతున్నది. తండ్రిమాటలు పదే పదే చెవుల్లో మారు మోగుతున్నాయి. జీవితంమీద అసహ్యం వేసింది. తనపై జాలి పడింది. ఎంత నిగ్రహించుకుందా మనుకున్నా ఆగని దుఃఖం పెల్లు బుకుతున్నది. ఎవరితోనూ చెప్పుకోలేని తన నిస్సహాయత క్రుంగ దీస్తున్న దామెను.

మరొకరితో చెప్పుకునేందుకు సిగ్గు. అయినా ఏమని చెప్పుకో గలదు ? ఎవరిని తప్పు పట్టగలదు ? ఒకవేళ ఎవరికైనా చెప్పుకుని మనోవేదన తగ్గించుకున్నా, ఎదుటివారు సానుభూతి మాటలు మాట్లాడినా, మనిషి చాటు కాగానే పరిహాసాలు చేస్తారు. హేళనగా మాట్లాడుకుంటారు. చివరకు తనకు మిగిలేది అవమానమే. అందుకే ఎవరికీ చెప్పుకోలేని స్థితిలో తనలో తనే కుమిలి పోతుంటుంది కుసుమ.

ఆవేశంలో అనరాని మాటలు అన్న కుటుంబరావు గదిలోకి వెళ్ళి ఏకాంతంగా కూతురు చేస్తున్న పనే చేస్తున్నాడు. తనలో తనే మూగగా రోదిస్తున్నాడు. గుండె లవిసేలా విలపిస్తున్నాడు.

కన్న కూతురుపట్ల పాషాణంలా ప్రవర్తించవలసిన తన దౌర్భాగ్యానికి తనను తానే నిందించుకుంటున్నాడు. కనిపించని దేవుణ్ణి, కనిపించే మనుషుల్ని తిట్టుకుంటున్నాడు.

ఆయన కన్నీటి పొరల్లోంచి గతం కదలాడసాగింది. ఇరవై సంవత్సరాల క్రిందటి సంఘటనలు ఆయన మదిలో కదలాడాయి.

కుసుమ .. అప్పటి ముద్దుపేరు చిన్నారి. ఎంత గారాంబంగా పెరిగింది ! ఎంత అపురూపంగా చూసుకున్నారు కుటుంబరావు దంపతులు !

పాప సరిగ్గా అన్నం తినడంలేదనీ, చిక్కిపోతున్నదనీ, కుసుమ తల్లి అనడం ఆలస్యం వెంటనే డాక్టర్ దగ్గరకు పెరుగెత్తుకు వెళ్ళేవాడు కుటుంబరావు.

బలానికి టానిక్కులు, ఆకలికి మాత్రలు, పెరుగుదలకు సిరప్స్, పాలల్లో కలిపి తాగించేందుకు రకరకాల పౌడర్లు వగైరా లన్నీ డాక్టర్లు రాసిఇవ్వటం, తను కొనుక్కువెళ్ళటం జరుగుతుండేది.

కుసుమ ఏమీ తినేది కాదు, తాగేది కాదు. పళ్ళు తినిపిస్తే విరోచనాలు, పాలు తాగిస్తే అజీర్తి, అన్నం అంటే ఆమడదూరం పరుగెత్తేది.

భార్యా భర్తలిద్దరూ పాపను డాబామీదకు తీసుకు వెళ్ళి చందమామను చూపిస్తూ, వీధిలైట్లను, వీధిలో మనుషుల్ని చూపిస్తూ

ముద్ద ముద్దకూ బ్రతిమిలాడుతూ తినిపించేవాళ్ళు. ఒక్క ముద్దన్నా తింటే బాగుండనుకునేవాళ్ళు. రెండు ముద్దలు తినిపించేందుకు రెండున్నర గంటలు వెచ్చించి, కబుర్లు, కథలుచెప్పేవాళ్ళు. అయినా సరే పాప పట్టెడన్నం తింటే అదే పదివేలనుకునేవారు. ఒక్కపూట అయినా విసుక్కుని ఎరగరు.

ప్రతి రోజూ ఆఫీసునుంచి వచ్చేటప్పుడు స్వీట్సు, బిస్కెట్లు కొని తెచ్చేవాడు కుటుంబరావు. ఒకరోజు కాకపోతే ఒకరోజైనా తింటుందేమో అన్న ఆశతో ఏపూటైనా పాప ఓ ముక్క తింటే సంబరపడిపోయే వాళ్ళిద్దరూ పాపం, పాప కొంచెం ఇష్టంగా ఏదైనా తినటం జరిగితే వాళ్ళిద్దరి కడుపులూ నిండిపోయేవి.

కూతురు కడుపునిండా తింటే చూడటానికే వేచి వుండేవారు కుటుంబరావు దంపతులు. దినదిన గండంగా కాలంగడిచిపోయింది. కుసుమ కొంచెం పెద్దది అయ్యేసరికి ఈ కష్టాల్నుంచి తప్పించుకున్నారు ఆమె తల్లితండ్రులు.

గతమంతా కళ్ళముందు కదలాడేసరికి దుఃఖం మరింత ఎక్కువైంది కుటుంబరావుకు.

అంత అపురూపంగా చూసుకున్న కూతుర్ని....ఇప్పుడిలా ... ఇంత కఠినంగా....ఆపైన ఆలోచించలేకపోయా డాయన.

కుసుమ ఆరోగ్యంలో ఏ లోపమూ లేదు. డాక్టర్లు ఎవరూ ఆహారం విషయంలో నిషేధాలు పెట్టలేదు. అయినాసరే ఆమె

ఇప్పుడు తన ఇష్టప్రకారం ఎప్పుడంటే అప్పుడు. ఏది పడితే అది తినకూడదు. తండ్రి సమక్షంలో ఆయన చెప్పిన ప్రకారం తినాలి. ఎప్పుడయినా ఆయన లేకుండా ఏదైనా తిన్నదంటే ఇలాగే చివాట్లు తినాల్సివస్తుంది. అందుకే సాధ్యమైనంత వరకూ తనూ జాగ్రత్తగానే ఉంటున్నది కుసుమ. అయినా చాలా అరుదుగా, ఎప్పుడైనా మనసు పడి తెగిస్తే -- ఇలా తండ్రిచేత అవమానం.

★ ★ ★

వడివడిగా కూతురి గదివైపు నడిచాడు కుటుంబరావు. జడ అల్లుకుంటూ కూర్చున్న కుసుమ తండ్రిని చూసి సిగ్గుపడింది. తల దించుకుంది. ఏడ్చి ఏడ్చి అలసిపోయిన కళ్ళుచూసి విలవిల్లాడిపోయాడు కుటుంబరావు.

"చూడు కుసుమా. ఆవేశంతో అనరాని మాటలు అన్నాను. నిన్ను బాధపెట్టాను. అయినా నిన్నిలా నిర్బంధించడంలో నాకుమాత్రం సంతోషం ఏముంటుంది తల్లీ? నీ బాగు కోసం, నీ మేలుకోరే నే నిలాంటి ఆంక్షలు పెట్టానని నీకుమాత్రం తెలీదా"

"కోరినంత కట్నం ఇవ్వగలను. అడిగిన లాంఛనాలన్నీ అమర్చగలను. నీ ఒంటినిండా నగలు చేయించనూ గలను."

"నీకు చదువుంది. సంస్కారం ఉంది. అందం ఉన్నది. ఐశ్వర్యమూ ఉంది. ఆ శుభముహూర్తంకోసమే ఎదురుచూస్తున్న నాకుమాత్రం ప్రతిసారిలాగే ఈసారికూడా నిరాశే మిగిలింది. అందరూ చెప్పిన సాకే వారూ చెప్పారు, "అమ్మాయి కొంచెం లావుగా ఉన్నదని, వాళ్ళ సంబంధం అంటే ఇష్టపడటంలేదని

ఆఫీసునుంచి వస్తుంటే మధ్యవర్తి కనిపించి చెప్పాడు. ఆకోపాన్ని, చిరాకుని నీమీద చూపించాను.

"నాకు తెలుసు నీవు ఎంత జాగ్రత్తగా ఉంటున్నావో, నీ నోరు ఎలా కట్టేసుకుంటున్నావో, నీ ఆకలి ఎలా తట్టుకుంటున్నావో, నీలో నువ్వే ఎంత కుమిలిపోతున్నావో, అన్నీ తెలిసీ ఏమీ చేయలేకపోతున్నాను." కూతుర్ని కౌగలించుకొని పసిపిల్లవాడిలా ఏడ్చాడు కుటుంబరావు.

"ఊరుకోండి నాన్నగారూ, మీరన్నందుకు నాకు కోపమూ లేదు, బాధా లేదు... నా పెళ్ళి గురించి మీరేమీ ఆందోళన పడకండి."

ఆరిందలా తనను ఊరడించ ప్రయత్నిస్తున్న కుసుమలోని చిన్నారి రూపం కుటుంబరావుని ఆశ్చర్యపరించింది.

"బాధపడక చేయగలిగిందేముంది తల్లీ ? ఆడపిల్ల పుట్టిన క్షణం నుంచీ పెళ్ళే పరమావధిగా భావిస్తున్న సమాజంలో ఆడపిల్ల ఆకలి తీరేవరకూ తిననూకూడదు, కోరిక తీరేవరకూ చదవనూ కూడదు... కదూ ?" అన్నాడాయన ఉద్వేగంగా.

"లేదు నాన్నా... నా పెళ్ళి విషయం కొంతకాలం మరచిపోండి. కాలానికి వదిలెయ్యండి. నేను పి. జి. చేయాలనుకుంటున్నాను. ఇదిగో అప్లికేషన్ ఫారం. ఇక్కడ సంతకం చేయండి" అంటున్న కూతురివంక ప్రశంశాపూర్వకంగా చూశాడు కుటుంబరావు.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 16-12-87)